30వ తేదీ వరకు

పెండింగ్ నీటిబిల్లులు చెల్లించొచ్చు

చిలకలగూడ రిజర్వాయర్ డీజీఎం మోహన్‌రాజ్



ముషీరాబాద్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ముషీరాబాద్ నియోజకవర్గంలోనే అతిపెద్దదైన చిలకలగూడ రిజర్వాయర్ పరిధిలో తాగునీరు, డ్రైనేజీ సమస్యలు, ఇతర సమస్యలపై తీసుకుంటున్న చర్యల గురించి చిలకలగూడ రిజర్వాయర్ డీజీఎం మోహన్‌రాజ్ 'ఆంధ్రజ్యోతి'తో పలు విషయాలు పంచుకున్నారు.

రిజర్వాయర్ పరిధిలో ఎన్ని సెక్షన్లు ఉన్నాయి. ఎన్ని ఎంజీడీల నీళ్లు కావాలి?

రిజర్వాయర్ పరిధిలో ఆజామాబాద్, ముషీరాబాద్, బాగ్‌లింగంపల్లి సెక్షన్‌లున్నాయి. ఈ మూడు సెక్షన్ల పరిధిలో 21,100 డొమెస్టిక్ తాగు నీటి కనెక్షన్‌లున్నాయి. రోజూ 7.2 ఎంజీడీల నీరు అవసరం. అందరికీ సరిపడా తాగునీరు వదులుతున్నాం. తాగునీటి సరఫరాలో ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా తగుచర్యలు తీసుకుంటున్నాం.

దీర్ఘకాలికంగా పెండింగ్ బిల్లుల వసూలు కోసం ఏం చర్యలు తీసుకుంటున్నారు?

మూడు సెక్షన్‌ల పరిధిలో 10,800ల మంది కస్టమర్ల బిల్లులు పెండింగ్ ఉన్నాయి. మొత్తం రూ.12 కోట్లు బిల్లులు రావాల్సి ఉంది. వారి కోసం ప్రత్యేకంగా ఈనెల 30లోపు బిల్లులు చెల్లిస్తే ఎలాంటి పెనాల్టీ, వడ్డీ, లేట్ పేమెంట్ చార్జెస్ లేకుండా కేవలం బిల్లు మాత్రమే చెల్లించే విధంగా అవకాశం కల్పించాం. ఈ అవకాశాన్ని బకాయిదారులు సద్వినియోగం చేసుకోవాలి.

పొంగుతున్న డ్రైనేజీ సమస్యల పరిష్కారానికి ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

డ్రైనేజీ సమస్యల పరిష్కారానికి ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు డ్రైనేజీ లీకేజీల నివారణకు 90 రోజుల స్పెషల్ డ్రైవ్ కార్యక్రమం నిర్వహిస్తున్నాం. దీనిలో భాగంగా రోజూ 150 నుంచి 200 మీటర్ల వరకు సమస్యాత్మక ప్రాంతాల్లో మ్యాన్‌హోల్స్ నుంచి మట్టి, వ్యర్థాలను తొలగించి సమస్యలను పరిష్కరిస్తున్నాం. రిజర్వాయర్ పరిధిలో ప్రతీరోజు 40 నుంచి 45 డ్రైనేజీ లీకేజీల ఫిర్యాదులు వస్తున్నాయి. వాటిని ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నాం.

భూగర్భ జలాల పెంపునకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

భూగర్భ జలాల పెంపునకు 300ల గజాల స్థలం ఉన్న ప్రతీ ఇంటి యజమాని తప్పని సరిగా ఇంకుడుగుంత ఏర్పాటు చేసుకునేలా చర్యలు తీసుకుంటున్నాం. ఇప్పటికే పలువురికి నోటీసులు అందజేశాం. ఇంకుడుగుంత ఏర్పాటు చేసుకోనివారిపై చర్యలు తీసుకుంటున్నాం.



చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే గోపాల్, శ్రీనివాస్, ప్రభాకర్

ఆపదలో ఉన్నవారికి ఆపన్నహస్తం సీఎంఆర్ఎఫ్

చిక్కడపల్లి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఆపదలో ఉన్నవారికి సీఎం సహాయనిధి ఆపన్నహస్తంగా ఉపయోగపడుతోందని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. మంగళవారం సాయంత్రం గాంధీనగర్ డివిజన్ జవహర్‌నగర్‌లోని క్యాంప్ కార్యాలయంలో భోలక్‌పూర్ డివిజన్‌కు చెందిన 9 మంది లబ్ధిదారులకు 3 లక్షలా 70 వేల రూపాయల చెక్కులను ఆయన పంపిణీ చేశారు. వైద్య ఖర్చులు భరించలేని అర్హులైనవారు సీఎం సహాయనిధికి దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో భోలక్‌పూర్ బీఆర్ఎస్ అధ్యక్షుడు వై.శ్రీనివాస్, మీడియా ఇన్‌చార్జి ముచ్చకుర్తి ప్రభాకర్, మునవ్వర్‌చాంద్, మహమ్మద్‌అలీ, మక్బూల్, చాంద్‌పాషా, ప్రవీణ్‌రాజ్, అస్లాం, గోవిందరాజ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటు డ్రైవర్ల సమస్యలను పరిష్కరించాలి

చిక్కడపల్లి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఆటో, ప్రైవేటు డ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ తెలంగాణ ఆటో, ప్రైవేట్ ట్రాన్స్‌పోర్ట్ యూనియన్స్ జేఏసీ నేతలు రవాణా శాఖ కమిషనర్‌ను కలిసి వినతిపత్రం మంగళవారం సమర్పించారు. ఈ సందర్భంగా జేఏసీ నేతలు అల్లూరి రవి శంకర్, శ్రీధర్‌రెడ్డి, ఈశ్వర్, యాదగిరి, సమ్మయ్య, వజ్రలింగంలు మాట్లాడుతూ ఆటో, టాక్సీ డ్రైవర్ల ఉపాధిని దెబ్బతీసే ఓలా ఊబర్ రాపిడో, యారి బైకుల అక్రమ వ్యాపారాన్ని నిషేధించాలన్నారు. కమిషనర్‌ను కలిసిన వారిలో జేఏసీ నేతలు రవి, పెంటయ్యగౌడ్, చారి, శ్రీనివాస్, రవి ఉన్నారు.

పద్మశాలి సంఘం రాష్ట్ర కోశాధికారిగా నవీన్



బింగి నవీన్

ముషీరాబాద్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర పద్మశాలి సంఘం కోశాధికారిగా భోలక్‌పూర్‌కు చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు బింగి నవీన్ నియమితులయ్యారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వల్లకాటి రాజ్‌కుమార్ నియామకపత్రాన్ని నవీన్‌కు మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా నవీన్ మాట్లాడుతూ.. పద్మశాలీల సమస్యల పరిష్కారానికి విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో రాణించే విధంగా తనవంతు కృషి చేస్తానన్నారు. పద్మశాలీల చేతివృత్తిని, మరమగ్గాల రక్షణ ప్రధాన లక్ష్యంగా పనిచేస్తామని పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తజనాభాలో 6 శాతం ఉన్న పద్మశాలీలను ప్రభుత్వాలు ఆదుకునే విధంగా కృషి చేస్తానన్నారు. తనపై నమ్మకం ఉంచి రాష్ట్ర కమిటీలో బాధ్యతలు అప్పగించినందుకు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాజ్‌కుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

రాజకీయ విభాగం అధ్యక్షురాలిగా సమత

బర్కత్‌పుర: తెలంగాణ పద్మశాలి సంఘం రాజకీయ విభాగం అధ్యక్షురాలుగా డాక్టర్ ఒగ్గు సమత, ప్రధాన కార్యదర్శిగా బైరి అమరావతిలు నియమితులయ్యారు ఈ మేరకు నారాయణగూడ తెలంగాణ పద్మశాలి భవనంలో వారు నియామకపత్రాలు మంగళవారం అందుకున్నారు. తమకు పదవి కేటాయించిన తెలంగాణ పద్మశాలి మహిళ అధ్యక్షురాలు గుంటక రూప, అఖిల భారత పద్మశాలి సంఘ అధ్యక్షులు స్వామి ప్రధాన కార్యదర్శి గడ్డం జగన్నాథం తెలంగాణ పద్మశాలి సంఘ అధ్యక్షులు కమర్తపు మురళి, ప్రధాన కార్యదర్శి రామచంద్రం, తెలంగాణ పద్మశాలి మహిళా విభాగం ప్రధాన కార్యదర్శి స్వప్న రేఖ తదితరులకు వారు కృతజ్ఞతలు తెలిపారు.



ఆశా వర్కర్లకు అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి డా.మనోజ్‌రెడ్డి

ఆశా వర్కర్లు క్రమశిక్షణతో పని చేయాలి

ముషీరాబాద్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఆశా వర్కర్లు క్రమశిక్షణతో పని చేస్తూ ఆసుపత్రి పరిధిలో అనారోగ్యంతో బాధపడుతున్నవారు, గర్భిణులకు మెరుగైన వైద్యం అందేలా పని చేయాలన్నారు. మంగళవారం భోలక్‌పూర్ ప్రభుత్వ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (యూపీహెచ్‌సీ)లో ఆశా వర్కర్ల విధివిధానాలపై అవగాహన కల్పించే కార్యక్రమాన్ని నిర్వహించారు. దీనికి ముఖ్యఅతిథిగా హాజరైన డాక్టర్ మనోజ్‌రెడ్డి మాట్లాడుతూ.. ఆశా వర్కర్లు ఇంటింటికీ వెళ్లి గర్భిణులు, బాలింతల ఆరోగ్య వివరాలను సేకరించడంతో పాటు మెరుగైన వైద్యం అందేలా పని చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో యూపీహెచ్‌సీ టీహెచ్ఎన్ ఫెల్లిస్, ఏఎన్ఎంలు విజయకుమారి, సునీత, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

ఘాటైన వాసనలతో ఉక్కిరిబిక్కిరి

జనావాసాల మధ్య అగరబత్తుల తయారీ కేంద్రంతో ఇబ్బందులు



అగరబత్తుల ముడి సరుకును తరలిస్తున్న సిబ్బంది

రాంనగర్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): అడిక్‌మెట్ డివిజన్ రాంనగర్ స్ట్రీట్ నెంబర్ 18లో జనావాసాల మధ్య కొనసాగుతున్న అగరబత్తుల తయారీ కేంద్రం వల్ల స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. తయారీ కేంద్రం నుంచి వెలువడుతున్న రసాయన వాసనల వల్ల అనారోగ్యాలకు గురవుతున్నారు. ఓ ప్రైవేట్ ఆసుపత్రి రెండు పాఠశాలలు వందలా ఇళ్ల మధ్య ఈ అగరబత్తుల తయారీ కొనసాగడం వల్ల స్థానికులు శ్వాసకోస సమస్యలు ఎదుర్కొంటున్నారు. కార్ఖానా పక్కనే పాఠశాల ఉండడంతో విద్యార్థులు సైతం ఘాటైన వాసనలకు పలు సమస్యలు ఎదుర్కొంటున్నట్లు స్థానికులు వాపోతున్నారు. అగరబత్తుల కార్ఖానాను తొలగించాలని జీహెచ్ఎంసీ హెల్త్ విభాగం, వైద్యాధికారులకు, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులకు స్థానికులు ఫిర్యాదు చేసినా ఎలాంటి చర్యలూ తీసుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. సౌమ్య ఆసుపత్రి పక్కన గల స్ట్రీట్ నెంబర్ 18 నుంచి రాంనగర్ రామాలయం, పోచమ్మ దేవాలయం పార్శిగుట్ట వైఎస్ఆర్‌పార్కుకు వెళ్లే వారు స్ట్రీట్‌నెంబర్ 18 నుంచి వెళ్లాల్సి ఉంటుంది. ఇదే రోడ్డులో కొనసాగుతున్న ఈ కార్ఖానా వల్ల దానిని నుంచి వెలువడే దుమ్ము, దూళి వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, ముక్కులు మూసుకొని వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా జీహెచ్ఎంసీ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులు స్పందించి అగరబత్తుల కార్ఖానను అక్కడి నుంచి తరలించాలని కోరుతున్నారు.

డ్రైనేజీ సమస్య శాశ్వత పరిష్కారానికి చర్యలు



పారిశుధ్య సిబ్బందితో మ్యాన్‌హోల్‌ను శుభ్రం చేయిస్తున్న గోరక్‌నాథ్

ముషీరాబాద్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ముషీరాబాద్ డివిజన్‌లోని గంగపుత్రకాలనీలో నెలకొన్న డ్రైనేజీ సమస్య శాశ్వత పరిష్కారానికి జలమండలి అధికారులు చర్యలు తీసుకోవాలని ముషీరాబాద్ బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు పూస గోరక్‌నాథ్ డిమాండ్ చేశారు. మంగళవారం గంగపుత్రకాలనీలో డ్రైనేజీ మ్యాన్‌హోల్ నిండి పొంగి పొర్లుతుండడంతో స్థానిక ప్రజల ఫిర్యాదు మేరకు సమస్యను జలమండలి అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో అధికారులు ఎయిర్‌టెక్ యంత్రం పంపించి మ్యాన్‌హోల్‌ను శుభ్రం చేయించారు. ఈ సందర్భంగా పూస గోరక్‌నాథ్ మాట్లాడుతూ.. గంగపుత్రకాలనీలో దశాబ్ద కాలంగా డ్రైనేజీ సమస్యతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదర్కొంటున్నారని, ఎమ్మెల్యే ముఠా గోపాల్ ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోవడంలేదని ఆరోపించారు. అధికారులు స్పందించి ప్రజా సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.



నగరంలోని ఇందిరాపార్కు ధర్నాచౌక్ వద్ద సీఐటీయూ, టీయూసీఐ, బీఆర్‌టీయూ మరియు ఆటో జాక్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మహాధర్నాకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హాజరయ్యారు.



డ్రైనేజీ పైప్‌లైన్‌ను రోడ్డు మధ్యలో నిర్మించాలి



డ్రైనేజీ పైప్‌లైన్ పనులను పరిశీలిస్తున్న వెంకటేష్, మహేందర్‌బాబు

కవాడిగూడ, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): కవాడిగూడ డివిజన్ అరవింద్‌నగర్‌లో 40 లక్షల రూపాయలతో నిర్మించ తలపెట్టిన డ్రైనేజీ పైప్‌లైన్ ఇళ్లను ఆనుకొని కాకుండా రోడ్డు మధ్యలో నిర్మించాలని అరవింద్‌నగర్ కాలనీవాసులు మంగళవారం కాలనీని సందర్శించిన వాటర్ వర్క్స్ డీజీఎం కార్తీకరెడ్డి, బీజేపీ నేతలను కోరారు. అరవింద్‌నగర్‌లో నూతనంగా ఏర్పాటు చేసే డ్రైనేజీ పైప్‌లైన్‌కోసం రోడ్డును తవ్వుతుండగా పెద్దఎత్తున బండరావడంతో పనులు నిలిపివేశారు. ఈ సందర్భంగా మంగళవారం వాటర్ వర్క్స్ డీజీఎం కార్తీకరెడ్డి, బీజేపీ రాష్ట్ర నాయకులు జి.వెంకటేష్, డివిజన్ అధ్యక్షుడు ఎంసీ మహేందర్‌బాబు కాలనీలో సందర్శించి స్థానికులతో మాట్లాడారు. ఈ సందర్భంగా స్థానికులు మాట్లాడుతూ.. రోడ్డు మధ్యలో నుంచి పైప్‌లైన్ నిర్మించాలని తమ ఇళ్ల ఫుట్‌పాత్‌లను ఆనుకొని పైప్‌లైన్ నిర్మించవద్దని డీజీఎం, బీజేపీ నేతల దృష్టికి తీసుకెళ్లారు. ఏది ఏమైనా స్థానికుల అభిప్రాయాలు తీసుకున్న తరువాతే పైప్‌లైన్ పనులు చేపడతామని డీజీఎం తెలిపారు. కార్యక్రమంలో డివిజన్ ప్రధాన కార్యదర్శులు ఎ ప్రభాకర్ గంగపుత్ర, కేశవరాజు, పరిమల్‌కుమార్, టీఆర్ఎస్ డివిజన్ మాజీ అధ్యక్షుడు ఆర్ రాంచందర్, వాటర్‌వర్క్స్ ఏఈ సుప్రజ, కాలనీవాసులు పాల్గొన్నారు.

ట్రాలీ ఆటోలో విద్యార్థుల తరలింపుపై ఆగ్రహం



విద్యార్థులను ఆటో ట్రాలీలో తరలిస్తున్న దశ్యాలు

రాంనగర్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ముషీరాబాద్ పరిధిలోని జాంభవినగర్‌లో గల ఓ ప్రైవేట్ పాఠశాల యాజమాన్యం 20 మంది విద్యార్థులను సికింద్రాబాద్ జింఖానా గ్రౌండ్‌లో జరిగే ఎన్‌సీసీ కార్యక్రమానికి విద్యార్థులను ట్రాలీ ఆటోలో తరలించింది. తరలింపులో ఎలాంటి భద్రతా చర్యలు చేపట్టకుండా తరలించడంతో వివాదాలకు దారితీసింది. మంగళవారం జాంబవి నగర్‌లోని మార్టినెంట్ స్కూల్‌కు చెందిన 20 మంది విద్యార్థులను స్కూల్ యాజమాన్యం ఓపెన్ ట్రాలీలో తరలించారు. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

సీపీఆర్‌తో మనిషి ప్రాణాన్ని కాపాడొచ్చు



విద్యార్థులకు సీపీఆర్‌పై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ విజయ్‌భాస్కర్

రాంనగర్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): గుండెపోటు వచ్చినప్పుడు అతడికి సీపీఆర్ చేస్తే ప్రాణాలను కాపాడే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని ప్రముఖ వైద్యులు డాక్టర్ విజయభాస్కర్ పేర్కొన్నారు. ప్రస్తుతం వయస్సుతో సంబంధం లేకుండా పిల్లల నుంచి పెద్దల వరకు గుండెపోటు వస్తుందని, ప్రతి ఒక్కరికీ సీపీఆర్‌పై అవగాహన ఉండాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు. మంగళవారం బాగ్‌లింగంపల్లిలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విద్యా సంస్థల ఆధ్వర్యంలో విద్యార్థులకు సీపీఆర్‌పై అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న విజయభాస్కర్, అతని వైద్య బృందం సీపీఆర్ గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రతీ కాలేజీ విద్యార్థులకు సీపీఆర్‌పై అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ సరోజ వివేక్‌తో పాటు, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

కోతుల సమస్యలను పరిష్కరించాలి

రాంనగర్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): అడిక్‌మెట్ డివిజన్‌లోని విద్యానగర్, లలితానగర్, రాంనగర్ గుండు, అచ్యుత్‌రెడ్డి మార్గ్, గణేశ్‌నగర్, బాలాజీనగర్‌లో గత కొంత కాలంగా నెలకొన్న కోతుల బెడదతో ప్రజలు తీవ్ర బయభ్రాంతులకు గురవుతున్నారని, జీహెచ్ఎంసీ అధికారులు స్పందిం చి వాటిని బందించి అటవీ ప్రాంతాలకు తరలించాలని బీజేపీ రాంనగర్ డివిజన్ మాజీ అధ్యక్షుడు పాశం సాయికృష్ణయాదవ్ కోరా రు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ అడిక్‌మెట్ డివిజన్‌లోని పలు కాలనీలు, బస్తీలు, అపార్ట్‌మెంట్‌లలో కోతుల బెడద తీవ్రంగా ఉందని, దీనివల్ల ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావడానికి ఆందోళన చెందుతున్నారని పేర్కొన్నారు. ఈ సమస్యను జీహెచ్ఎంసీ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని వెంటనే స్పందించకుంటే జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయం ఎదుట పెద్దఎత్తున ధర్నా చేస్తామని వారు హెచ్చరించారు.

కేంద్రం విధానాలపై రేపు జాతీయ సదస్సు



మాట్లాడుతున్న గంగాధరణ్ తదితరులు

రాంనగర్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలు, మతోన్మాద కార్పొరేట్ ఫాసిస్టు పాలనకు వ్యతిరేకంగా ఈనెల 7న కమ్యూనిస్టు కో ఆర్డినేషన్ కమిటీ ఆధ్వర్యంలో నగరంలో జాతీయ సదస్సు నిర్వహిస్తున్నట్లు కమ్యూనిస్టు కో ఆర్డినేషన్ కమిటీ ప్రతినిధి గంగాధరన్ తెలిపారు. మంగళవారం ఓంకార్‌భవన్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సదస్సుకు కమ్యూనిస్టు పార్టీలు పాల్గొని తమ విధానాన్ని తెలియజేస్తాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో కిరణ్‌జిత్‌సేన్, వనం సుధాకర్, నాగబూషణం, గాదగోని రవి, అభినవ్ దాసుశాస్త్రి, చంద్రమోహన్ ప్రసాద్, మహిపాల్, జితేందర్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



బీసీ కులగణనపై చర్చించేందుకు నగరానికి వచ్చిన ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీకి ఘనస్వాగతం పలికేందుకు అంబర్‌పేట నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి శంబుల శ్రీకాంత్‌గౌడ్, మాజీ కార్పొరేటర్ దిడ్డి రాంబాబు, పులి జగన్, గరిగంటి శ్రీదేవి రమేష్, యూత్ కాంగ్రెస్ గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు మోతె రోహిత్, నాయకులు సంతోష్‌కుమార్ గుప్తాతోపాలు పలువురు నాయకులు కార్యకర్తలకు బేగంపేట విమానాశ్రమానికి తరలివెల్లి స్వాగతం పలికారు.

- రాంనగర్, ఆంధ్రజ్యోతి



నాగుల పంచమి సందర్భంగా బాగ్‌లింగంపల్లి ఆలయంలో పూజలు చేస్తున్న మహిళలు

- రాంనగర్, ఆంధ్రజ్యోతి

'ఉస్మానియా' వద్ద బాలుడి కిడ్నాప్

- 12 గంటల్లో కిడ్నాపర్‌ను పట్టుకున్న పోలీసులు
- తల్లిదండ్రులకు బాలుడి అప్పగింత



బాలుడిని తల్లిదండ్రులకు అప్పగిస్తున్న డీసీపీ బాలస్వామి, ఏసీపీ శంకర్, సీఐ లింగేశ్వర్‌రావు

అఫ్జల్‌గంజ్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఉస్మానియా ఆస్పత్రిలో బాలుడి కిడ్నాప్ కేసును అఫ్జల్‌గంజ్ పోలీసులు 12 గంటల్లో ఛేదించారు. క్షేమంగా తల్లిదండ్రులకు అప్పగించారు. మంగళవారం అఫ్జల్‌గంజ్ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీసీపీ బి.బాలస్వామి, ఏసీపీ శంకర్, ఇన్‌స్పెక్టర్ లింగేశ్వర్‌రావు కిడ్నాప్ వివరాలను వెల్లడించారు. మల్లేపల్లి మంగర్‌బస్తీకి చెందిన మహ్మద్ సద్దాం, రుబీనా బేగం భార్యాభర్తలు. వీరికి ముగ్గురు పిల్లలు. సద్దాం అనారోగ్యంగా ఉండడంతో వైద్యం కోసం సోమవారం ఉదయం కుమారుడు షోయబ్(4)ని తీసుకొని ఉస్మానియా ఆస్పత్రికి వచ్చాడు. ఆస్పత్రిలో చూపించుకున్న తర్వాత ఓపీ భవనం వద్ద పడుకున్నాడు. వీరిని వరంగల్ ప్రాంతానికి చెందిన షేక్ రఫిక్(38) గమనించాడు. షోయబ్‌ని తీసుకుని కాలినడకన ఆబిడ్స్, సుల్తాన్‌బజార్, చాదర్‌ఘాట్ నుంచి డబీర్‌పురాకు వెళ్లాడు. రాత్రి అయినా ఉస్మానియా ఆస్పత్రికని వెళ్లిన భర్త తిరిగిరాకపోవడంతో ఆందోళన చెందిన రుబీనాబేగం ఆస్పత్రికి వచ్చింది. సద్దాం ఫుట్‌పాత్‌పై పడుకుని ఉండగా, షోయబ్ కనిపించ లేదు. వెంటనే అఫ్జల్‌గంజ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇన్‌స్పెక్టర్ లింగేశ్వర్‌రావు కేసు నమోదు చేసుకుని నాలుగు ప్రత్యేక టీమ్‌లను ఏర్పాటు చేసి బాలుడి కోసం వెతికారు. బస్టాండ్లు, రైల్వే స్టేషన్లలో ఉన్న సీసీ కెమెరాలను పరిశీలించారు. షేక్ రఫిక్ బాలుడిని తీసుకెళ్లినట్లుగా గుర్తించారు. వెంటనే అతడిని అదుపులోకి తీసుకుని విచారించగా బాలుడిని ఓ మహిళ వద్ద ఉంచినట్లు తెలిపాడు. డీఎస్ఐ రామకృష్ణ, టీమ్ బాలుడిని సురక్షితంగా తీసుకువచ్చి తల్లిదండ్రులకు అప్పగించారు. రఫిక్ నాలుగేళ్ల క్రితం వరంగల్ నుంచి నగరానికి వచ్చి ఫుట్‌పాత్‌లపై నివసిస్తున్నాడని, మద్యానికి బానిసై డబ్బుల కోసం బాలుడిని కిడ్నాప్ చేశాడని డీసీపీ వెల్లడించారు. కాగా, పోలీసులకు బాలుడి తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రతిభకు వైకల్యం అడ్డు కాదు: డీజీపీ



షీల్డ్ అందుకుంటున్న డీజీపీ జితేందర్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): ప్రతిభకు వైకల్యం అడ్డుకాదని రాష్ట్ర డీజీపీ జితేందర్ అన్నారు. అంబర్‌పేట వాటర్‌వర్క్స్ గ్రౌండ్‌లో డీఏబీటీ, తెలంగాణ జిల్లాల క్రికెట్ సంఘం (టీడీసీఏ) సంయుక్తంగా నిర్వహిస్తున్న అంధుల క్రికెట్ పోటీలను డీజీపీ మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ దివ్యాంగ క్రికెటర్ల ప్రతిభ, పట్టుదల, క్రమశిక్షణ సమాజంలోని ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమన్నారు. సంకల్ప బలం ఉంటే అసాధ్యమనేది ఏదీ ఉండదనే దానికి వీరే మంచి ఉదాహరణ అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ సీనియర్ సిటిజన్ శాఖ కమిషనర్ శైలజ, టీడీసీఏ వ్యవస్థాపక అధ్యక్షుడు అల్లీపురం వెంకటేశ్వర్‌రెడ్డి, డీఏబీటీ కార్యదర్శి శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ ఫీజు బకాయిలను విడుదల చేయాలి

బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య



అభివాదం చేస్తున్న మాజీ ఎంపీ ఆర్ కృష్ణయ్య, గుజ్జ కృష్ణ, రామకృష్ణ, గుజ్జ సత్యం తదితరులు

బర్కత్‌పుర, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న 5 వేల కోట్ల రూపాయల ఫీజు బకాయిలను ప్రభుత్వం వెంటనే మంజూరు చేయాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, మాజీ ఎంపీ ఆర్ కృష్ణయ్య డిమాండ్ చేశారు. బీసీ విద్యార్థుల సమస్యలపై రాజీలేని పోరాటం నిర్వహిస్తామని, ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని చెప్పారు. మంగళవారం కాచిగూడలోని అభినందన్ గ్రాండ్ హోటల్‌లో బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వేముల రామకృష్ణ ఆధ్వర్యంలో బీసీ విద్యార్థుల రాష్ట్రస్థాయి సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జకృష్ణ, సమన్వయ కర్తగా వ్యవహరించగా రాష్ట్రంలోని 33 జిల్లాల నుంచి పెద్దసంఖ్యలో బీసీ విద్యార్థి సంఘం నేతలు తరలివచ్చారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన మాజీ ఎంపీ ఆర్ కృష్ణయ్య మాట్లాడుతూ.. ఇంజనీరింగ్, ఇంటర్, పీజీ, డిగ్రీ, ఫార్మసీ, ఎంసీఏ, ఎంబీఏ కోర్సులు చదివే బీసీ విద్యార్థుల ఫీజును రాష్ట్ర ప్రభుత్వమే భరించాలన్నారు. ప్రస్తుతం ఉన్న 12 బీసీ కుల ఫెడరేషన్‌లను బీసీ కార్పొరేషన్‌లుగా మార్చాలని, ప్రైవేటు యూనివర్శిటీలలో బీసీ, ఎస్సీ, ఎస్టీలకు రిజర్వేషన్లు ప్రవేశ పెట్టాలని, విదేశాలలో చదువుకునే విద్యార్థులకు స్టైఫండ్ మంజూరు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కేంద్రం ఇకనైనా బీసీ వ్యతిరేక వైఖరి విడనాడాలని ఆయన విజ్ఞప్తి చేశారు. విద్య ఉద్యోగ రంగాలలో బీసీ రిజర్వేషన్లను 56 శాతానికి పెంచాలని డిమాండ్ చేశారు. ఈ సభకు అధ్యక్షత వహించిన తెలంగాణ బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వేముల రామకృష్ణ మాట్లాడుతూ.. మూసీ సుందరీకరణకు రాష్ట్ర ప్రభుత్వం లక్ష 50 వేల కోట్ల రూపాయలు కేటాయించిందని, విద్యారంగ అభివృద్ధికి కూడా అదే స్థాయిలో నిధులు కేటాయించాలని ఆయన డిమాండ్ చేశారు. బీసీ విద్యార్థుల ఉద్యమాన్ని పల్లె స్థాయికి విస్తరిస్తున్నామని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో పలు బీసీ సంఘాల నేతలు గుజ్జ సత్యం, నీలా వెంకటేష్, జిల్లపల్లి అంజి, సి.రాజేందర్, లాల్‌కృష్ణ, నందగోపాల్, జి.మల్లేష్‌యాదవ్, జి.అనంతయ్య పగిళ్లసతీష్, బీసీ కళామండలి నేత రామలింగం తదితరులు పాల్గొన్నారు.

ఎస్పీవో కానిస్టేబుల్ శ్రీనివాస్‌ను అభినందించిన స్టీఫెన్ రవీంద్ర



కానిస్టేబుల్ శ్రీనివాస్‌ను అభినందిస్తున్న సీపీ స్టీఫెన్ రవీంద్ర

అడ్డగుట్ట, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): పరుగు పోటీలలో మెడల్స్ సాధించిన ఎస్పీవో కానిస్టేబుల్ శ్రీనివాస్‌ను సీనియర్ ఐపీఎస్ అధికారి స్టీఫెన్ రవీంద్ర అభినందించారు. మూడు రోజుల క్రితం గచ్చిబౌలి స్టేడియంలో 5 కిలోమీటర్ల పరుగు పోటీలు నిర్వహించారు. గచ్చిబౌలిలో ఎస్పీవో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న శ్రీనివాస్ పోటీలలో పాల్గొన్నాడు. 5 కిలో మీటర్లను 14 నిమిషాల్లో పరిగెత్తి మెడల్ కైవసం చేసుకున్నాడు. మంగళవారం నగరంలో జరిగిన కార్యక్రమంలో పోలీసు ఉన్నతాధికారి ప్రశాంత్, స్టీఫెన్ రవీంద్ర తదితరులు పాల్గొని కానిస్టేబుల్ శ్రీనివాస్‌కు మెడల్స్ అందజేశారు. కాగా 2022, జూన్‌లో బెంగళూర్‌లో నిర్వహించిన 10 కిలో మీటర్ల పోటీలో పాల్గొ ని 33 నిమిషాలలో పూర్తి చేసి ప్రథమ స్థానాన్ని దక్కించుకున్నాడు. అదేవిధంగా 2023లో గచ్చిబౌలి స్టేడియంలో జరిగిన 50 కిలో మీటర్ల పరుగు పోటీలో పాల్గొని 3 గంటల 10 నిమిషాల్లో పూర్తి చేసి మొదటి స్థానంలో నిలిచారు. ఎస్పీవో కానిస్టేబుల్‌గా పరుగు పోటీలలో రాష్ట్రానికి పేరు ప్రతిష్టతలు తీసుకురావాలని సీపీ స్టీఫెన్ రవీంద్ర ఆకాంక్షించారు. మెడల్స్ సాధించిన శ్రీనివాస్‌ను పోలీస్ ఉన్నతాధికారులు, తోటి కానిస్టేబుళ్లు అభినందించారు.